క్లుప్తంగా

పద్మశాలి గ్రామ కమిటీ ఎన్నిక



శాయంపేట : మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం ఆవరణలో శుక్రవారం పద్మశాలి కుల బంధువుల సమక్షంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాయంపేట గ్రామ అధ్యక్షుడిగా బాసాని ప్రకాష్, ఉపాధ్యక్షులుగా మామిడి మారుతి, తుమ్మ ప్రభాకర్, ప్రధానకార్యదర్శిగా మంత్రి రమేష్‌బాబు, సహాయ కార్యదర్శులుగా బాసాని నవీన్, బత్తుల రాజేష్, కోశాధికారిగా గొట్టిముక్కల రమేశ్‌తో పాటు 9 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ప్రకాశ్ మాట్లాడుతూ పద్మశాలి కుల ఐక్యత కోసం, అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.

రాజేశ్ శర్మకు అభినందనలు



శాయంపేట : స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రాజేశ్ శర్మ గత నెలలో జరిగిన అంతర్జాతీయ కవితా పోటీల్లో పాల్గొనగా శుక్రవారం ఎక్సలెన్స్ సర్టిఫికెట్ పొందాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వనం వెంకటేశ్వరరావు రాజేశ్ శర్మకు సర్టిఫికెట్ అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ మెంబర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనరిక్ మందులు చాలా నాణ్యమైనవి



కమలాపూర్ : జనరిక్ మందులు చాలా నాణ్యమైనవని, బ్రాండెడ్ ఔషధాల కన్నా తక్కువ ధరకు లభిస్తాయని వైద్యాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం జన ఔషధ దినోత్సవం నిర్వహించి జనరిక్ ఔషధాలపై అవగాహన కల్పించారు. తక్కువ ధరల్లో నాణ్యమైన మందులు ప్రజలకు అందించాలన్న ఉద్దేశ్యంతో 2008లో ప్రధాని నరేంద్ర మోదీ జన ఔషధీని ప్రారంభించారన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1500 జన ఔషధ కేంద్రాలు ఉన్నాయన్నారు. అనంతరం పలువురు రోగులకు జనరిక్ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవీందర్, పీహెచ్‌ఎస్ లీలావతి, హెల్త్ సూపర్‌వైజర్ మరియా థామస్, స్టాఫ్ నర్స్ సరిత, సిబ్బంది ప్రభాకర్, గోవర్ధన్, బాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల చెట్ల తొలగింపు

వేలేరు : మండల కేంద్రం నుంచి శాలపల్లికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్లచెట్లు ఏపుగా పెరగడంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దారి కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో దీన్ని గుర్తించిన ఎస్సై అజ్మీరా సురేష్ జేసీబీ సాయంతో ముళ్లచెట్లను తొలగించి, రోడ్లపై ఉన్న గుంతలను మట్టిపోసి పూడ్చివేయించారు. దీంతో గ్రామస్తులు, ప్రయాణికులు ఎస్సై సురేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

మండల వైద్యాధికారిగా విజయభాస్కర్

పరకాల : మండల ప్రత్యేక అధికారిగా కె.విజయభాస్కర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రత్యేక అధికారిగా పనిచేసిన జిల్లా వెటర్నరీ అధికారి వెంకటనారాయణ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో విజయభాస్కర్‌ను పరకాల మండల ప్రత్యేక అధికారిగా నియమించారు. ఆయనను పరకాల ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులతో పాటు కార్యాలయ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

పరామర్శ

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన కోగిల అరవింద్ రైలు నుంచి జారిపడి కాళ్లు చేతులు పోగొట్టుకొని చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం సామాజిక సేవకుడు అమ్మ అశోక్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ అరవింద్ కుటుంబ పరిస్థితిని చూసి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అరవింద్ తల్లిదండ్రుల బ్యాంకు అకౌంట్‌కు రూ.50 వేల ఆర్థిసాయాన్ని పంపించారని అశోక్ తెలిపారు.

ఆర్థికసాయం

దామెర : మండలంలోని దుర్గంపేట గ్రామానికి చెందిన ముత్యాల గణేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం గౌడ సంఘ యూత్ సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 60,500 ఆర్థికసాయాన్ని అందజేశారు. అందజేసిన వారిలో గౌడ సంఘం యూత్ సభ్యులు ఉన్నారు.

సర్కారు బడిలో కార్పొరేట్ విద్య

- ప్రైవేట్‌కు దీటుగా వసతులు
- ప్రధానోపాధ్యాయుడి ఆలోచనతో జిల్లాకే ఆదర్శం

నడికూడ : అది చూడడానికే సర్కార్ బడి.. కానీ కార్పొరేట్ స్థాయిలో వసతులు అదే మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల. దానికి తగ్గట్టుగానే ఆంగ్ల మాధ్యమం గుణాత్మక బోధన ఉంది. 2018లో పాఠశాలకు వచ్చిన అచ్చ సుదర్శన్ ఉపాధ్యాయుడిగా వచ్చినప్పుడు 20 మంది విద్యార్థులు ఉండేవారు. సుదర్శన్ ముందుగా పాఠశాలలో ఆధునిక బోధన పరికరాలతో పాటు మౌలిక వసతులు కల్పిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని భావించి, పాఠశాలకు వివిధ రూపాల్లో శ్రీసాయి ట్రస్ట్ ద్వారా రూ.80 వేల విలు చేసే డెస్క్ బెంచీలు, చర్లపల్లి గ్రామమల్లన్న యూత్ వారు రూ.10 వేల విలువ చేసే ఫ్యాన్లు, రిటైర్ సైనికుడు మహ్మద్ ఉస్మాన్ రూ.20 వేల విలువ చేసే టీవీ, భారతీయ వాసవి సంఘం పుస్తక మిత్ర ఆధ్వర్యంలో రూ. 30 వేల విలువ గల పిల్లల లైబ్రరీ పుస్తకాలను, విద్యార్థులకు తాగునీటి సౌకర్యార్థం షిరిడి సాయి ట్రస్ట్ రూ.30 వేల ఆర్‌ఓ మిషన్ అందించారు. ప్రస్తుతం 1వ తరగతి నుంచి ఐదో తరగతి వరకు 80 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు.



తరగతి గదిలో డెస్క్ బెంచీలు

బోధన విధానంలో సృజనాత్మకతో నిత్యం విద్యార్థులను ఆకర్షించుకుంటుంది. 2023–24 విద్యా సంవత్సరం గురుకుల పాఠశాలకు 17 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 17 మంది విద్యార్థులు వివిధ పాఠశాలలో ప్రవేశం పొందడం జరిగింది.

ప్రతీ తరగతి గదిలో డెస్క్ బెంచీలు

ప్రతి తరగతిలో డెస్క్ బెంచీలు, గ్రీన్ బోర్డ్స్, నాలుగు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లతో పాటు ఇతర వసతులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థులు ఆడుకోవడానికి విశాలమైన ఆటస్థలం, పచ్చని చెట్లతో ఉంది.

ప్రధానోపాధ్యాయుడి ఆలోచనే..

ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ గ్రామంలో బడిఈడు పిల్లలను చేర్పించే విషయమై తల్లిదండ్రులకు వినూత్న పద్ధతితో అవగాహన కల్పించేవాడు.



పాఠశాల బోర్డు



వ్యవసాయ ఫీల్డ్ ట్రిప్స్‌లో విద్యార్థులు (ఫైల్)

ప్రతీ నెలా క్రమం తప్పకుండా తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి, వారి పిల్లల ప్రగతి గురించి వివరించే వాడు. దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడం జరిగింది.

పాఠశాల అభివృద్ధికి కృషి



ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించడం మన అందరి బాధ్యత, పాఠశాలలో చాలా వరకు పేద విద్యార్థులు చదువుకుంటారు. వారికి గుణాత్మక విద్యను అందించాలనే తపనతో పాఠశాల అభివృద్ధికి నా వంతు సాయం చేస్తూ దాతల సహాయం కోరుతూ పాఠశాల అభివృద్ధికి పడుతున్నాను. – అచ్చ సుదర్శన్, హెచ్‌ఎం

ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలి



చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు 80 మంది ఉంటే కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకపోయాను. ఉపాధ్యాయుల సంఖ్య పెంచితే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది.
– రమ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్

ప్రైవేట్‌కు దీటుగా విద్య



ఆటలతో పాటు చదువు, సాంస్కృతి కార్య క్రమాలు నేర్పిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మా ఉపాధ్యాయుల బోధన ఉంటుంది. ఆంగ్ల భాష నేర్చుకోవడానికి సులువైన పద్ధతిలో బోధన చేస్తున్నారు. ఉపాధ్యాయులు ఫ్రెండ్లీగా ఉంటున్నారు.
– కట్ల హిమాన్షురెడ్డి, 4వ తరగతి

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణ చర్యలో భాగంగా అధికారులు తక్షణమే గ్రామాల్లో పర్యటించి నీటి సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా ఓవర్ హెడ్ ట్యాంకులన క్లీనింగ్ చేయడం, నీటిశుద్ధి నాణ్యత పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వర్తించాలని అన్నారు. అవసరమైతే సమగ్ర ప్రణాళికలు రూపొందించి, అనుమతులు పొందుతూ పూర్తి స్థాయిలో మరమ్మతులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్న కేంద్రం

- బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

కమలాపూర్ : గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగా ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో అనేక పనులు చేపడుతున్నారని, గ్రామ రహదారులు మొదలుకొని జాతీయ రహదారుల అభివృద్ధి కోసం కేంద్రం ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పల్‌లో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రాజకీయాల మీద ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదన్నారు. గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే దమ్ము, ధైర్యం కాంగ్రెస్‌కు లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్లు, పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రు కాల్చి వాతపెట్టినా సిగ్గు రాలేదన్నారు. కాళేశ్వరంపై విచారణ, ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కుంభకోణం, డ్రగ్స్ కేసు, ఫార్ములా ఈ రేస్ కేసులను అటకెక్కించి బీఆర్‌ఎస్‌తో లోపాయికారి ఒప్పందాలతో ముందుకు సాగుతోంది ఎవరో ప్రజలకు అర్థమైందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్, నాయకులు తుమ్మ శోభన్, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, సుదరయ్య, రాజు, సతీష్, భిక్షపతి, కోటేశ్వర్, రాజ్ మహ్మద్, కుమార్, అకాష్, గణేష్, రాజు, రాంబాబు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

ఎస్సారెస్పీ కాల్వ ద్వారా చెరువులు నింపాలి

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు లింగయ్య

ఐనవోలు : రైతులు పండించిన పంటలకు నీళ్లు లేక వరి, మొక్కజొన్న, కూరగాయలు తదితర పంటలు ఎండిపోతున్నాయని ప్రభుత్వం వెంటనే ఎస్సారెస్పీ కాల్వ ద్వారా చెరవుల్లో నీరు నింపి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని వెంకటాపురం, ఒంటి మామిడిపల్లి, వనమాల కనపర్తి, కొండపర్తి, గుంటూరుపల్లి గ్రామాల్లో ఎండిపోతున్న పంటలను సీపీఎం నాయకులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ మండలంలో వరి, మొక్కజొన్న 9300 ఎకరాలు వేశారని వ్యవసాయ అధికారుల నివేదికలు ఉన్నాయన్నారు. ఎలాగైనా ఎస్సారెస్పీ నీరు వస్తుందని, బోర్లలో నీరుతో పంటలు పండించుకోవచ్చని ఆశతో పంటలు వేస్తే పంటలు ఎండిపోయి రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేని పరిస్థితి నెలకొందన్నారు. అదే విధంగా మిర్చి రైతులకు కనీస మద్దతు దర క్వింటాల్‌కు రూ. 25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కొండాల నారాయణరెడ్డి, మడిగె నాగరాజు, ఉప్పలయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎండి పోయిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శాయంపేట : మండలంలోని శాయంపేట, కొప్పుల గ్రామాల్లోకి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సబ్ స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం నేడు (శనివారం) ఉదయం 8 గంటల నుంచి 12 గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ చందూలాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దామెర : మండలంలోని గ్రామాల్లోని సబ్ స్టేషన్ పరిధిలోని ఊరుగొండ, సీతారాంపూర్, దుర్గంపేట, పసరగొండ, పులుకుర్తి గ్రామాలకు సబ్‌స్టేషన్‌లో నెల వారి మరమ్మతుల నిమిత్తం నేడు (శనివారం) ఉదయం 9 గంటల నుంచి 11 గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ గుర్రం రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేలేరు : మండలంలోని పీచర, నారాయణగిరి విద్యుత్ సబ్ స్టేషన్లలో అత్యవసర మరమ్మతుల కారణంగా ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని ఫీడర్లలో ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు శనివారం విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కుమారస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

దామెరలో డైమండ్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళం



దామెర : వారంతా 50 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్నారు. అనంతరం వివిధ ప్రదేశాల్లో వివిద రంగాల్లో స్థిరపడ్డారు. 50 ఏళ్ల తర్వాత కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో తమతో పాటు చదువుకున్న మిత్రుల కోసం ప్రయత్నాలు చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1974–75 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణమంతా కలియతిరి గారు. అప్పటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నా రు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి లకావత్ రాజేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



కమలాపూర్: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే సీజీఆర్‌ఎఫ్ ధ్యేయమని ఉత్తర తెలంగాణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వరంగల్ చైర్మన్ ఎన్‌వీ.వేణుగోపాలాచారి అన్నారు. స్థానిక విద్యుత్ ఏఈ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై సీజీఆర్‌ఎఫ్‌తో పాటు వాట్సాప్ ద్వారా కూడా లిఖిత పూర్వక ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం ఐదుగురు వినియోగదారుల నుంచి విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ సభ్యుడు ఆర్.చరణ్‌దాస్, ఇండిపెండెంట్ సభ్యుడు ఎం.రామారావు, డీఈ సామ్య నాయక్, ఏడీ వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పురుషులతో సమానంగా మహిళలు రాణించాలి

- పరకాల ఎంపీడీఓ ఆంజనేయులు



పరకాల : మహిళలను సన్మానించిన ఎంపీడీఓ ఆంజనేయులు

పరకాల : సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు రాణించాలని స్థానిక ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు పిలుపునిచ్చారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మహిళలు సామాజిక, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వపరంగా అందుతున్న సంక్షేమ పథకాలతో మరింత ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

ఆత్మకూరు : ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవం జరిగింది. మండలంలోని మహిళా పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

గొల్లవాడ ప్రాథమిక పాఠశాలలో..

మండల కేంద్రంలోని గొల్లవాడ ప్రాథమిక పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను అంగన్‌వాడీ టీచర్లను ఆయాలను మధ్యాహ్న భోజన కార్మికులను ఘనంగా సన్మానించారు.

వేలేరు : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే వారి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని ఏపీఎం జయసుధ, ఎస్‌బీఐ మేనేజర్ అక్తరున్నీసా అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా పీఎంఎస్‌ఈ పథకం లబ్ధిదారులకు రుణమంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రవణ్‌కుమార్, బ్యాంకు అధికారులు వేదామృత, మక్కల శ్రీకాంత్, సీసీ అశోక్, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : మహిళా పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది



వేలేరు: లబ్ధిదారులకు రుణమంజూరు పత్రాలను అందజేస్తున్న అధికారులు

అరెస్ట్ చేయాలి



ఎల్కతుర్తి : జగిత్యాల జిల్లా సారంగాపూర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానపరిచిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు చెప్యాల ప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సంఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చి దుండగులకు కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కండె సుధాకర్, బాబు, వెంకన్న, కార్తీక్, వంశీ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

- రూ.లక్ష నగదు, 3 తులాల బంగారం అపహరణ



వివరాలు సేకరిస్తున్న ఎస్సై వీరభద్రరావు

కమలాపూర్ : తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని గుర్తుతెలియని దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. మండలంలోని వంగపల్లిలో దేవరాజు శంకరయ్య, దేవరాజు భద్రయ్య అన్నదమ్ముల ఇళ్లలో గురువారం చోరీలకు పాల్పడి ఒకరింట్లో రూ. లక్ష నగదు, మరొకరి ఇంట్లో రెండున్నర తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరయ్య, భద్రయ్య గురువారం ఉదయం తమ ఇళ్లకు తాళాలు వేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు మధ్యాహ్నం వేళలో ఇళ్ల తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలు పగులగొట్టి నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు, ఇంట్లోని బీరువాల తాళాలు పగులగొట్టి ఉన్నాయని, బీరువాల్లోని నగదు, బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. వరంగల్ నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. 15 రోజుల క్రితం వంగపల్లిలో పలువురి ఇళ్లలో దొంగతనాలు జరిగాయని, కొలిపాక సారయ్య ఇంట్లో రూ.10 వేల నగదు, చంద్రమౌళి ఇంట్లో ఒకసారి రూ.7 వేలు, మరోసారి రూ.5 వేలు, అర్ధ తులం బంగారం చోరీకి గురైందని బాధితులు, గ్రామస్తులు తెలిపారు. వరుస దొంగతనాలతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రమేశ్(ఫైల్)

ఐనవోలు : వెనుక వైపు నుంచి గుర్తుతెలియని వాహనం ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పంథిని గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన నిమ్మనబోయిన రమేశ్(42) తన స్నేహితుడు శంకెపల్లి కుమారస్వామి ద్విచక్రవాహనంపై కలిసి వరంగల్‌కు శుక్రవారం బయలుదేరారు. ఉదయం పంథిని గ్రామశివారు వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి అర్షనపెల్లి శ్రీరామ్‌భూపాల్ ఇంటి ఎదుట వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీ కొట్టడంతో వెనుక కూర్చున్న రమేశ్ కింద పడడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారస్వామి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుని భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

48 గంటల్లో హత్యాయత్నం కేసు ఛేదింపు

- ఎస్సై, సిబ్బందిని అభినందించిన సీఐ



శాయంపేట : మండలంలోని గోవిందాపూర్‌లో బుధవారం రాత్రి మాజీ సర్పంచ్ చింతనిప్పుల భద్రయ్యపై అదే గ్రామానికి చెందిన బొత్త శ్రావణ్‌కుమార్ పాత కక్షలతో గొడ్డలితో దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. సీఐ రంజిత్‌రావు కథనం ప్రకారం.. మండలంలోని గోవిందాపూర్‌కు చెందిన భద్రయ్యపై పాత కక్షలతో బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ గొడ్డలితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్సై జక్కుల పరమేష్ తన సిబ్బందితో శ్రావణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. విచారణలో తన అన్న కుమారుడు బొత్త కుమారస్వామి సహకరించినట్లు, హత్యకు ముప్పు శ్రీశైలం పోత్సహించడంతో హత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. హత్యయత్నం కేసులో ఏ1 నిందితుడు శ్రావణ్‌కుమార్‌ను, ఏ2గా బొత్త కుమారస్వామి పరారీలో ఉన్నట్లు తెలిపారు. హత్యకు పోత్సహించిన శ్రీశైలంను అరెస్ట్ చేసి హత్యకు సంబంధించి గొడ్డలిని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. 48 గంటల్లో హత్యయత్నం కేసును అత్యంత చాకచక్యంగా ఈ మిస్టరీని ఛేదించిన ఎస్సై పరమేశ్‌ను వారికి సహకరించిన కానిస్టేబుల్స్ సతీష్ శ్రీధర్, ఖలీద్, హోంగార్డు చందులను సీఐ రంజిత్‌రావు అభినందించారు. ఎవరైనా నేరం చేసి తప్పించుకోలేరని ఎవరూ కూడా నేరానికి పాలప్డి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా ఫోన్ ద్వారా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తామన్నారు.

జీపీ సిబ్బందికి ఇచ్చిన హామీలు అమలు చేయాలి

కమలాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ సిబ్బందికి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ జీపీ సిబ్బంది బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా గ్రీన్ చానల్ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించాలన్నారు. జీపీ సిబ్బందిని 2వ పీఆర్సీ పరిధిలోకి తీసుకొచ్చి జీఓ నంబర్ 60 ప్రకారం కేటగిరీల వారిగా వేతనాలు చెల్లించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఇసంపెల్లి ఐలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, మండల ఉపాధ్యక్షుడు జి.రమేష్, నాయకులు వీరస్వామి, రమేష్, శ్రీదేవి, సుశీల, సారమ్మ పాల్గొన్నారు.



ఐనవోలు : ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఐనవోలు : వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో గ్రామపంచాయతీ సిబ్బందికి ఇచ్చిన హామీల ప్రకారం వేతనాలు చెల్లించాలని, వేతన చెల్లింపుకు బడ్జెట్ కేటాయించే విధంగా చూడాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి సిహెచ్.వెంకటయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లుకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందచేశారు. సంపత్, సుకేందర్, రవి, కొమురయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.